సాక్షి
కుమురం భీం
శుక్రవారం : 31 : జనవరి : 2025

నమో నాగోబా

కేస్లాపూర్ నాగోబా జాతరకు మూడోరోజూ భక్తజనం పోటెత్తారు. గురువారం మెస్రం వంశీయులు పెర్సపేన్, భాన్ దేవతలకు పూజలు నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా నాగోబాను దర్శించుకున్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

- మరిన్ని వివరాలు 8లో▸


ఆసిఫాబాద్: సాంస్కృతిక ప్రదర్శనలు తిలకిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, తదితరులు

న్యూస్‌రీల్

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని ప్రసిద్ధ గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. చిలుకూరి బాలాజీ శివాలయం ప్రధాన అర్చకుడు ఆత్మారాం మహరాజ్ ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెండో తిరుపతిగా పేరుగాంచిన గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఎంతో మహిమ గల దైవమన్నారు. ఘనమైన చరిత్ర ఉందని, ఆలయ విశిష్టతను భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో గిరి ప్రదక్షిణ చేపట్టినట్లు వివరించారు. ప్రతినెలా శ్రావణా నక్షత్రం రోజు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పందిర్ల వినోద, ఆలయ అర్చకులు గణేష్‌శర్మ, బీఆర్ఎస్ నాయకులు పందిర్ల మధునయ్య, రాఘవేంద్రశర్మ, శంకర్, శ్రీనివాస్‌రావు, సంతోష్‌రావు, రాజమౌళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు


వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్పీ చిత్తరంజన్

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఫిబ్రవరి 11 నుంచి 13 వరకు నిర్వహించే జాతరలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. గురువారం ఆలయాన్ని సందర్శించి రోడ్డు మార్గాలను పరిశీలించారు. జాతరకు ఎంతమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి చేరుకునేందుకు అందుబాటులో ఉన్న రోడ్డు మార్గాలపై ఆరా తీశారు. గతంలో తలెత్తిన సమస్యలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. రెబ్బెన మండల కేంద్రం నుంచి ఆలయానికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపుల గుంతలు లేకుండా మట్టితో పూడ్చాలన్నారు. ఎక్కడా వాహనాలు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, ఆలయ చైర్మన్ జయరాం, సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్, నాయకులు తుల సీరాం, సంతోష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి


విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

తిర్యాణి(ఆసిఫాబాద్): విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టిసారించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం రాత్రి బస చేసిన ఆయన.. గురువారం ఉదయం విద్యార్థులతో కలిసి యోగా, వ్యాయమం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యాయమం అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థి లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు.

మహోన్నత వ్యక్తి గాంధీ

ఆసిఫాబాద్‌అర్బన్: అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రం సాధించిన మహోన్నత వ్యక్తి గాంధీ అని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆర్డీవో లోకేశ్వర్‌రావు, జిల్లా అధికారులతో కలిసి మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. మహాత్మా గాంధీ చిర స్మరణీయుడని కొనియాడారు.

జిల్లాకు కృషి..
రైతులకు తోడ్పాటు

రైతులకు మెరుగైన సేవలందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా కృషి విజ్ఞాన కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. రైతులను సేంద్రియ సాగువైపు ప్రోత్సహించడం.. సాంకేతికతతో అధిక దిగుబడుల సాధనకు తోడ్పాటు అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఈ క్రమంలో కౌటాల మండలం కనికిలో కొత్తగా కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. దీనిపై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కేవీకే ఏర్పాటుకు కనికిలో అధికారులు గుర్తించిన స్థలం

- జిల్లాకు కృషి విజ్ఞాన కేంద్రం మంజూరు
- ఆధునిక సాగు, నూతన పద్ధతులపై రైతులకు తోడ్పాటు
- కౌటాల మండలం కనికి శివారులో ఏర్పాటుకు కసరత్తు
- 50 ఎకరాలు సేకరించేందుకు చర్యలు
- స్థల పరిశీలన పూర్తిచేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

కౌటాల(సిర్పూర్): కృషి విజ్ఞాన కేంద్రాలు(కేవీకే) రైతులకు నూతన సాంకేతికత, పరిశోధన ఫలితాలతో పాటు బహుముఖ సేవలందిస్తున్నాయి. దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాల సేవలు అమలులోకి వచ్చి అర్ధశతాబ్దం పూర్తయిన సందర్భంగా కేవీకే స్వర్ణోత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా 16 కేవీకేలను ప్రకటించింది. ఇందులో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కూడా ఉంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో తాజాగా కౌటాల మండలం కనికి గ్రామ శివారులో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్థలాన్ని పరిశీలించారు. కేవీకే ఏర్పాటుతో స్థానిక రైతులకు మెరుగైన సేవలందనున్నాయి.

50 ఎకరాల విస్తీర్ణంలో..

ఐకార్(ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్) ఆధ్వర్యంలో ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం సహకారంతో కనికిలో కేవీకే కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. గ్రామ శివారులో 80 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా, ఇక్కడ 50 ఎకరాలను కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. స్థానిక రైతులు సైతం కనికి గ్రామంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కేవీకే కేంద్రంలో ఒక సీనియర్ సైంటిస్టు, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక శాస్త్రవేతలు ఆరుగురితోపాటు ఒక మేనేజర్, ఇద్దరు కార్యక్రమ సహాయకులు, మరో ఇద్దరు పరిపాలన సిబ్బంది, ఒక ట్రాక్టర్ డ్రైవర్, మరో ముగ్గురు సాంకేతిక ఉద్యోగులను నియమిస్తారు. కృషి విజ్ఞాన కేంద్రాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పనిచేస్తాయి. వీటి నిర్వహణ, జీతభత్యాలను పూర్తిగా కేంద్ర వ్యవసాయ శాఖనే భరిస్తుంది.

సేవలు మరింత చేరువ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం నుంచే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని రైతులకు సేవలు అందుతున్నాయి. జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. అత్యధికంగా పత్తి సాగు చేస్తుండగా, ఆ తర్వాత వరి, మొక్కజొన్న, జొన్న, మిరప పంటల సాగు ఎక్కువగా ఉంది. కనికిలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయనుండడంతో జిల్లా రైతులకు సేవలు మరింత చేరువకానున్నాయి. పరిశోధన సంస్థలు సృష్టించిన నూతన వంగడాలను మొదట వీటి క్షేత్రాల్లో పరిశీలిస్తారు. వచ్చిన ఫలితాలపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. నూతన సాగు విధానాలపైనా పరిశోధనలు కొనసాగుతాయి. వీటి ద్వారా నాణ్యమైన విత్తనాలు, భూసార పరీక్షల కిట్లు, వ్యవసాయ యంత్రాలు, పరికరాలనూ అందజేస్తున్నారు. చీడపీడలు, తెగుళ్ల నివారణ, వాతావరణ సమాచారం లభిస్తోంది. వ్యవసాయం, ఉద్యానంతో పాటు అనుబంధ రంగాలైన పాడి, కోళ్లు, పట్టు పురుగులు, తేనెటీగలు, చేపల పెంపకంలో సలహాలు, సూచనలిస్తారు. రైతులు ఆధునిక, సాంకేతిక పద్ధతిలో పంటలు సాగు చేసి రెట్టింపు ఆదాయం పొందే అవకాశం కలుగుతుంది.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తోంది. కౌటాల మండలం కనికి గ్రామ శివారులో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ఇవి కేంద్ర ప్రభుత్వ నిధులతో పనిచేస్తాయి. విత్తనాలు, ఇతర సలహాలు అందించేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. వీలైనంత త్వరలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయిస్తాం. కౌటాల మండలంలో ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్(టి)

ఎంతో ఉపయోగకరం



ఏటా సరైన పంట దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సేవలు అందుబాటులో వస్తే సమీకృత వ్యవసాయం ఊపందుకుంటుంది. విపత్కర పరిస్థితుల్లోనూ వేర్వేరు పంటలతో ఆదాయం పొందేలా శిక్షణ ఇస్తారు. మా గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. కేవీకే కేంద్రం ఏర్పాటు చేస్తే జిల్లా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఓనాజీ, రైతు, కనికి, మం.కౌటాల

రైతులకు మేలు



కేంద్ర ప్రభుత్వం కొత్తగా జిల్లాకు కృషి విజ్ఞాన కేంద్రం మంజూరు చేసింది. ఐకార్(ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్), ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం సమన్వయంతో కౌటాల మండలం కనికిలో కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వ స్థలం పరిశీలించాం. స్థల సేకరణ పూర్తయితే పనులు ప్రారంభిస్తాం. ఇక్కడ ఒక ప్రొఫెసర్, ఆరుగురు శాస్త్రవేతలతో పాటు మొత్తం 16 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారు. సాంకేతికతను రైతులకు చేరువ చేసి వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడానికే కృషి చేస్తారు. కనికి గ్రామంలో కేవీకే ఏర్పాటుకు స్థానిక రైతులు ముందుకొచ్చారు.

– డా. ఎ.శ్రీనివాస్, ప్రొఫెసర్, కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యానశాఖ యూనివర్సిటీ

గుస్సాడీ రారాజు కనకరాజు


నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే బొజ్జుపటేల్, నాయకులు

- రాష్ట్ర మంత్రి సీతక్క

జైనూర్(ఆసిఫాబాద్): పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు గుస్సాడీ రారాజు అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో గురువారం నిర్వహించిన కనక రాజు సంతాప సభకు ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కనక రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి మాట్లాడుతూ దండారీ ఉత్సవాల విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. మార్లవాయితోపాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతిని ప్రపంచానికి చాటిన కనక రాజును ఆదివాసీ సమాజం ఎప్పటికీ మరువదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన నగదు బహుమతిలో రూ.20 లక్షలను గుస్సాడీ శిక్షణ కేంద్రానికి కేటాయించి భావితరాల కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. అనంతరం కనక రాజు సతీమణులు భీంబాయి, పార్వతీబాయిలను సత్కరించారు. కార్యక్రమంలో జీసీసీ రాష్ట్ర చైర్మన్ తిరుపతి, నాయకులు ఆత్రం సుగుణ, మల్లేశ్, విశ్వనాథ్, అబ్దుల్ ముఖిద్, కనక ప్రతిభ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


'పద్మశ్రీ' కనకరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క, తదితరులు

'అమ్మ ఆదర్శ' పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఫిబ్రవరి 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎంపిక చేసిన ప్రతీ పాఠశాలలో తాగునీరు, మూత్రశాలల నిర్మాణం, విద్యుద్దీకరణ, గదుల మరమ్మతులు చేపట్టాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. పూర్తయిన పనులకు మాత్రమే ఎంబీ రికార్డులు పూర్తి చేసి బిల్లులకు సమర్పించాలని సూచించారు. సమావేశంలో డీటీడీవో రమాదేవి, డీపీవో భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఆసిఫాబాద్‌రూరల్: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా విద్యార్థులు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారి భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రత, పీరియడ్స్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా ఫెసిలియేటర్ ఎన్‌జీవో భాను, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది శారద, రాణి, సాగర్, రాజేశ్వరి, మమత పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న భాస్కర్

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో లోవోల్టేజీ సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్నిరకాల పరికరాలు సకాలంలో సరఫరా చేస్తామన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సబ్‌స్టేషన్ పనులు పరిశీలన

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని రవీంద్రనగర్ -2 సమీపంలో నిర్మాణంలో ఉన్న 132/33 కేవీ సబ్‌స్టేషన్ పనులను గురువారం టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం నిర్మాణ స్థలంలో మొక్కలు నాటారు. ఆయన వెంట ఆపరేషన్ సీఈ అశోక్, టెక్నికల్ డీఈ సంపత్ రెడ్డి, ఎస్ఈ వీరేశం, కాగజ్‌నగర్ డీఈలు నాగరాజు, జీవరత్నం, ఎస్ఈ పి.వెంకటేశ్వర్‌రావు, ఈఈ విజయ్‌ప్రతాప్, ఏడీఈలు బి.లక్ష్మీనారాయణ, రాజేశ్వర్, పి.శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- ఎంపీ గోడం నగేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యశాల సమావేశానికి సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య విజయం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, మల్లికార్జున్, ఖాండ్రె విశాల్, కోట్నాక విజయ్, మాటూరి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

మండలానికో 'మోడల్' గృహం

- మండల కేంద్రాల్లో నిర్మాణాలకు శ్రీకారం
- ఇప్పటికే కౌటాల, సిర్పూర్(టి), వాంకిడిలో భూమిపూజ
- రెండు నెలల్లో పూర్తిచేసేందుకు అధికారుల కసరత్తు

పెంచికల్‌పేట్(సిర్పూర్): ప్రభుత్వం నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 335 గ్రామ పంచాయితీలతో పాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో లబ్ధిదారులను ఎంపిక కోసం నాలుగు రోజుల పాటు అధికారులు వార్డు, గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటికే మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి జనవరి 26న పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అర్హుల ఎంపిక ప్రక్రియ తుదిదశకు చేరుకుంటున్న నేపథ్యంలో లబ్ధిదారులకు గృహ నిర్మాణంపై అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ గృహాలు నిర్మించనున్నారు. మండల కేంద్రాల్లోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణ, ప్రభుత్వ భూముల్లో రూ.5లక్షల నిధులతో గృహ నిర్మాణ శాఖ, ఇంజినీరింగ్ అధికారులు పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే జిల్లాలోని కౌటాల, సిర్పూర్(టి) మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, వాంకిడి మండల కేంద్రంలో ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మోడల్ గృహ నిర్మాణ పనులకు ఇటీవల భూమిపూజ చేశారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసింది. ప్రజాపాలన, ప్రత్యేక గ్రామ సభల్లో వేలాది దరఖాస్తులు వచ్చాయి. అధికారులు ఇప్పటికే నిర్వహించిన గ్రామసభ, వార్డు సభల్లో అర్హుల జాబితాను చదివి వినిపించి కొత్త దరఖాస్తులు సైతం స్వీకరించారు. ప్రజాపాలన, ప్రత్యేక గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 85,059 దరఖాస్తులు వచ్చాయి.

400 చదరపు అడుగుల విస్తీర్ణం..

ఇందిరమ్మ ఇళ్లను రూ.5లక్షల వ్యయంతో 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించడానికి గృహ నిర్మాణ శాఖ అధికారులు నమూనా తయారు చేశారు. హాలు సైజ్ 9X10 చదరపు అడుగులు, వంట గది 6.9X10 చదరపు అడుగులు, బెడ్‌రూం అటాచ్డ్ బాత్‌రూం, వాష్ ఏరియాతో కలిపి 12.5X10.5 చదరపు అడుగులతో నమూనా రూపొందించారు. ఇంటి నిర్మాణంలో ఐదు తలుపులు, నాలుగు కిటికీలు, రెండు వెంటిలేటర్లు ఉంటాయి. వీటితోపాటు ఇంటి లోపల, బయట టైల్స్ సైతం వేయడానికి ఏర్పాట్లు చేశారు.


కౌటాలలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్(ఫైల్)

అవగాహన కోసమే..

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం. రూ.5 లక్షల వ్యయంతో నిర్మించే ఇంటిలో అన్నిసౌకర్యాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇప్పటికే మూడు మండలాల్లో గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించాం.

– వేణుగోపాల్, డీఈ, గృహ నిర్మాణశాఖ అధికారి

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లాలోని 77 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు వృత్తి మార్గదర్శకత్వంపై శిక్షణ అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించాలన్నారు. వారు జీవితంలో ఉన్నతస్థాయికి వెళ్లేలా బోధన చేయాలని సూచించారు. ఆదర్శ ఉపాధ్యాయులుగా నిలవాలన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని అన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ గామీనియల్, ఎస్‌వో అమరేందర్‌రెడ్డి, హెచ్‌ఎం సుభాష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారి శ్రీనివాస్

1 నుంచి ప్రత్యేక డ్రైవ్

ఆసిఫాబాద్‌అర్బన్: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ 141 వార్షికోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 1 నుంచి ప్రతీ పోస్టాఫీస్‌లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు సిర్పూర్ కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సిరికొండ సతీశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఆసిఫాబాద్, వాంకిడి, చిర్రకుంట తపాలా కార్యాలయాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌పై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సబ్ పోస్ట్ మాస్టర్ యోగేశ్, పోస్టల్ అసిస్టెంట్ ప్రశాంత్ రానా, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సతీశ్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి


సాయన్న, పోసాని (ఫైల్)

సోన్: రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన దంపతులు మరిపెద్ది సాయన్న (56), మరిపెద్ది పోసాని(50) గురువారం ద్విచక్ర వాహనంపై నిజామాబాద్ జిల్లాలోని దూదిగాం గ్రామానికి బంధువుల ఇంటికి వెళ్తుండగా సోన్ ఐబీవద్ద 44వ జాతీయ రహదారిపై నిర్మల్ నుంచి ఆర్మూర్ వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే పోసాని మృతి చెందింది. సాయన్నను అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుల కుమారుడు సురేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై హైమద్ హుస్సేన్ తెలిపారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్..


లచ్చయ్య(ఫైల్)

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాలిగంటి లచ్చయ్య (52) గుండెపోటుతో మృతి చెందినట్లు సీఐ రవీందర్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం విధులు ముగించుకున్న లచ్చయ్య తమకు కేటాయించిన క్వార్టర్‌కు వెళ్లి నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు వచ్చింది. అపస్మారకస్థితిలో పడి ఉండగా గమనించిన సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని స్వగ్రామం దండేపల్లి మండలంలోని మామిడిపల్లికి మృతదేహాన్ని తరలించినట్లు సీఐ తెలిపారు.

నాణ్యత పాటించకుంటే కఠిన చర్యలు


హోటల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ అధికారి తరియ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతరలో ఏర్పాటు చేసిన హోటళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు నాణ్యత, శుభ్రత పాటించనట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నమో నాగోబా

- పెర్సపేన్, భాన్‌దేవతలకు పూజలు
- కొత్త కోడళ్లకు నాగోబా చరిత్ర బోధించిన ప్రధాన్ కిత మెస్రం వంశీయులు
- భక్తజన సంద్రమైన కేస్లాపూర్

పుష్యమాస అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 28న నాగోబా మహాపూజతో జాతర ప్రారంభించిన మెస్రం వంశీయులు గురువారం పెర్సపేన్, భాన్ దేవతలకు సంప్రదాయ పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో నాగోబా ఆలయ పరిసర అటవీప్రాంతం జనసంద్రమైంది.

– ఇంద్రవెల్లి(ఖానాపూర్)


నాగోబా దర్శనానికి బారులు తీరిన భక్తులు

భాన్‌దేవతకు..


భాన్ దేవతలను శుద్ధిచేస్తున్న మెస్రం అల్లుళ్లు

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు సంప్రదాయ వాయిద్యాలతో నాగోబా ఆలయం వెనుక గల భాన్‌దేవత ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భేటింగ్ అయిన కొత్త కోడళ్లు కోనేరు వద్దకు వెళ్లి పవిత్రమైన జలం తీసుకురాగా మెస్రం వంశం అల్లుళ్లు భాన్‌దేవత ఆలయం ముందు పాత పుట్టలను తొలగించారు. మెస్రం వంశ మహిళలు, ఆడపడుచులు కోనేరు నీటితో కొత్త పుట్టలను తయారు చేసి మొక్కుకున్నారు. భాన్ దేవతలను శుద్ధిచేసి నైవేద్యం సమర్పించారు.

పెర్సపేన్ దేవతకు పూజలు


పెర్సపేన్‌కు మొక్కుతున్న మెస్రం వంశీయులు

గోవడ్ నుంచి సంప్రదాయ వాయిద్యాలతో నాగోబా ఆలయానికి వచ్చిన మెస్రం వంశీయులు పక్కనే నాలుగు సగల పెర్సపేన్ (పెద్ద దేవుళ్ల)కు పవిత్ర గంగాజలంతో శుద్ధిచేసి ఘనంగా పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మెస్రం వంశానికి చెందిన పురుషులు మాత్రమే పాల్గొన్నారు. ఫిబ్రవరి 1న గోవడ్ ముఖద్వారం వద్ద బేతల్ పూజలు చేసి మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు ముగించనున్నట్లు నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు.

కొత్త కోడళ్లకు 22 కితల చరిత్ర బోధన

గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు సంప్రదాయ వంటలు చేసి సంహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ప్రధాన్ కితకు చెందిన మెస్రం రాము ఆధ్వర్యంలో కిక్రి వాయిస్తూ మెస్రం వంశానికి చెందిన కొత్త కోడళ్లకు, మెస్రం వంశ మహిళలకు నాగోబా చరిత్ర, మెస్రం వంశానికి చెందిన 22 కితల చరిత్రను బోధించారు. అనంతరం ప్రధాన్ కిత మెస్రం వంశీయులకు కానుకలు అందించారు.


చరిత్ర బోధిస్తున్న ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయులు

మెస్రం వంశీయుల మొక్కులు


ఆవును వదులుతున్న మెస్రం వంశీయులు

జాతరలో భాగంగా నార్నూర్ మండలంలోని గుంజల గ్రామానికి చెందిన మెస్రం భీంరావ్ కుటుంబ సభ్యులు నాగోబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవును వదిలి మొక్కు చెల్లించుకున్నారు. జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏఎస్పీ కాజల్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశ పెద్దలు కోసేరావ్, చిన్న పటేల్, తిరుపతి, దాదారావ్, తదితరులు పాల్గొన్నారు.

మండలిలో రాజీలేని పోరాటం

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్
- పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి

ఆదిలాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే శాసనమండలిలో రాజీలేని పోరాటం చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన ఎమ్మెల్యే పాయల్ శంకర్, అభ్యర్థులు అంజిరెడ్డి, కొమరయ్యతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్సీలుగా గెలిచిన వారంతా అధికార పక్షం వహిస్తూ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు విస్మరిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అభ్యర్థులు ఉపాధ్యాయ, విద్యారంగాలపై ఎంతో పట్టు కలిగి ఉన్నారని తెలిపారు. మిగతా పార్టీలతో పోలిస్తే తమ పార్టీ అభ్యర్థుల ఎంపిక, ప్రచారం విషయంలో ముందుందని పేర్కొన్నారు. పాలక పక్షానికి ధీటుగా పట్టభద్రులు, ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా తమ అభ్యర్థులు మండలిలో ప్రశ్నిస్తారని తెలిపారు. మెరుగైన సమాజం విద్యతోనే సాధ్యమని, విద్యారంగానికి సంబంధించిన సమస్యలు పరిష్కారమైతేనే సమాజ పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్లను పలు పార్టీలు ఎన్నికల సమయంలో వాడుకుని ఆ తర్వాత వదిలేస్తున్నాయని దుయ్యబట్టారు. తమ అభ్యర్థులను గెలిపిస్తే శాసనమండలిలో ప్రశ్నించే గొంతుకలకు అవకాశం కల్పించిన వారవుతారని తెలిపారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పరిపాలనలో ఎమ్మెల్సీలు గళమెత్తడమే మర్చిపోయారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికే అండగా నిలిచేలా వారి వ్యవహారం ఉందని మండిపడ్డారు. తమ అభ్యర్థులను గెలిపిస్తే మండలిలో ప్రతీ అన్యాయంపై ప్రశ్నిస్తారని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు లాలమున్న, దారట్ల జీవన్, రత్నాకర్‌రెడ్డి, విజయ్, మయూర్ తదితరులు పాల్గొన్నారు.

సమాధి తవ్విన ముఠా అరెస్టు

- గుప్త నిధులకోసం ఎముకలు ఎత్తుకెళ్లిన దుండగులు
- వివరాలు వెల్లడించిన సీఐ రమేశ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ముత్యం రమేశ్

కౌటాల: గుప్త నిధుల తవ్వకాలకు, క్షుద్ర పూజలు చేయడానికే సమాధి తవ్వి అందులోని మృతదేహం ఎముకలను ఎత్తికెళ్లిన ముఠాను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ముత్యం రమేశ్ తెలిపారు. గురువారం కౌటాల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. బెజ్జూర్ మండలం ఏటిగూడకు చెందిన ఎర్నాగి చిన్నయ్య ఈ నెల 16న అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహాన్ని పత్తిచేనులో పాతిపెట్టారు. ఈ నెల 29న ఉదయం మృతుని పెద్ద కుమారుడు రాజేశ్ అతని స్నేహితుడితో కలిసి పత్తి చేనులో బహిర్భూమికి వెళ్లాడు. దుర్వాసన రావడంతో సమాధి వద్దకు వెళ్లి చూడగా సమాధిని తవ్వి మృతదేహం చేతులు నరికి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలుపడంతో గ్రామానికి చెందిన గేడెం రావుజీ ఇంటికి కొద్ది రోజులుగా కారులో కొంతమంది వస్తున్నారని, సమాధిని వారే తవ్వి ఉంటారని అనుమానంతో మృతుని భార్య ఎర్నాగి కళాబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ కుశ్నపల్లి గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక కారులో ఐదుగురు కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించగా మౌని అమావాస్య సందర్భంగా సమాధి వద్ద క్షుద్ర పూజలు చేసి మృతదేహం 5 ఎముకలను తీసుకున్నట్లు ఒప్పుకున్నారు. బెజ్జూర్ మండలం గొల్లవాడకు చెందిన ఇనుగుర్తి రమేష్ ఏ1, కరీంనగర్ జిల్లా రామ్‌నగర్‌కు చెందిన కాసారపు పరమేశ్వర్ ఏ2, బెజ్జూర్ మండలం గబ్బాయికి చెందిన ఆత్రం శంకర్ ఏ3, ఏటిగూడకు చెందిన గెడెం రావుజీ ఏ4, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కొక్కెరకుంటకు చెందిన గొల్ల రాజు ఏ5గా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పరిస్థితులు మెరుగుపడకుంటే చర్యలు


విద్యార్థులతో మాట్లాడుతున్న కోట్నాక తిరుపతి

కాసిపేట: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పరిస్థితులు మెరుగు పడకుంటే చర్యలు తప్పవని గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. గురువారం మండలంలోని మల్కేపల్లి, రేగులగూడ గిరిజన ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. రేగులగూడలో బాత్ రూంలకు డోర్‌లు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డెన్‌లు అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రేగులగూడ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేయగా విద్యార్థులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట పెంద్రం శ్రీను, మడావి వెంకటేష్, పెంద్రం శంకర్, పెంద్రం తిరుపతి, తదితరులు ఉన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


వరప్రసాద్ (ఫైల్)

లక్సెట్టిపేట: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయి కాంప్లెక్స్‌లో నివాసముంటున్న వరప్రసాద్ (23) ఇంటర్ వరకు చదివి ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది అనారోగ్యంతో అతని తండ్రి మృతి చెందగా మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో డబ్బులు అడిగితే ఇవ్వకపోవడంతో గురువారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరి భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడు బలవన్మరణం


తరుణ్‌కుమార్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: వాహనాలకు ఉపయోగించే కూలెంట్ తాగి యువకుడు బలవన్మరణం చెందినట్లు ఏఎస్సై వెంకన్న గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌లో నివాసం ఉంటున్న తరుణ్‌కుమార్ (21) స్థానిక మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా పనికి వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండడంతో తల్లి సూరమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో వాహనాలకు ఉపయోగించే కూలెంట్ తాగాడు. గమనించిన స్థానికులు ముందుగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కొరకు వరంగల్‌లోని ఎంజీఎంకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై వెంకన్నగౌడ్ తెలిపారు.

అడవిపందిని హతమార్చిన ముగ్గురిపై కేసు


మాంసం, నిందితులతో ఎఫ్ఆర్‌వో అప్పలకొండ

వేమనపల్లి: విద్యుత్ తీగలు అమర్చి అడవిపందిని హతమార్చిన ముగ్గురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎఫ్ఆర్‌వో అప్పలకొండ తెలిపారు. నీల్వాయి గ్రామానికి చెందిన నరివెల్లి మల్లయ్య, మంత్రి రాజన్న, నికాడి నగేష్ గ్రామ శివారులో ఉన్న పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని పొలం ఉండడంతో అందులోనే 11కేవీ విద్యుత్ వైర్‌కు ఉచ్చు అమర్చారు. రాత్రి సమయంలో అడవిపంది పడడంతో ముక్కలుగా కోసి విక్రయించే క్రమంలో తమకు అందిన సమాచారం మేరకు డెప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్‌కుమార్, ఎఫ్‌బీవో మహిపాల్ ఘటన స్థలానికి వెళ్లారు. అడవిపంది మాంసంతో పాటు ఉచ్చుకు ఉపయోగించిన విద్యుత్ వైర్లు, నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అటవీ చట్టాలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆకలి తీర్చేలా.. అల్పాహారం!

- ఫిబ్రవరి 1 నుంచి విద్యార్థులకు స్నాక్స్
- ప్రత్యేక తరగతుల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

ఉమ్మడి జిల్లా విద్యార్థులు, మంజూరైన నిధులు

జిల్లా	విద్యార్థులు	నిధులు
ఆదిలాబాద్	2,848	రూ.16,23,360
నిర్మల్	3,225	రూ.18,38,250
మంచిర్యాల	2,426	రూ.13,82,820
ఆసిఫాబాద్	1,773	రూ.10,10,610


వేమనపల్లిలో ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్/లక్ష్మణచాంద: విద్యార్థి దశలో అత్యంత కీలకమైనది పదోతరగతి. ఉన్నత విద్యకు ఇదే పునాదిలాంటిది. మార్చి 21 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 'పది'లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ ప్రత్యేక తరగతులు చేపట్టింది. గతేడాది నవంబర్ 4 నుంచి సాయంత్రం 4:15 నుంచి 5:15 వరకు గంటపాటు స్పెషల్ క్లాస్‌లు నిర్వహిస్తోంది. జనవరి 1, 2025 నుంచి ఉదయం 8:15 నుంచి 9:15 వరకు, సాయంత్రం 4:15 నుంచి 5:15 వరకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్కారు పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో పదోతరగతి చదువుతూ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 29న పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి డీఈవోలకు ఉత్తర్వులు జారీ చేశారు.

అల్పాహారం ఇలా..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పదోతరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖ పక్కా ప్రణాళికతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు పాఠశాలలు నడిచే 38 రోజుల పాటు స్నాక్స్ అందించాలని నిర్ణయించింది. స్పెషల్ క్లాసులకు హాజరవుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఉడకబెట్టిన పెసర్లు, పల్లీలు–బెల్లం, చిరుధాన్యాలతో చేసిన మిల్లెట్, బిస్కెట్లు, శనిగలు రోజుకో రకం చొప్పున అందించనున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల మహిళలకే అల్పాహార బాధ్యతలు అప్పగించారు.

అర్ధాకలితోనే ప్రత్యేక తరగతులకు..

పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరయ్యేందుకు ఉదయం పాఠశాలకు ముందుగానే రావడం.. సాయంత్రం ఆలస్యంగా ఇంటికి వెళ్లే పరిస్థితులు. దీంతో అర్ధాకలితోనే తరగతులకు హాజరు కావాల్సి వస్తోంది. పదోతరగతి విద్యార్థుల్లో ఎక్కువ శాతం మంది సమీప గ్రామాల నుంచి బస్సులు, ఆటోలు, సైకిళ్లపై పాఠశాలకు వస్తుంటారు. ఉదయం ప్రత్యేక తరగతులు ఉండటంతో ఇంట్లో అల్పాహారం తీసుకోకుండానే ఖాళీ కడుపుతోనే పాఠశాలకు వస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. అంతేకాకుండా సాయంత్రం ఇంటికి చేరే వరకు దాదాపు 6 నుంచి 7 గంటలకు పైగానే సమయం పడుతోంది. ఇది గమనించిన ప్రభుత్వం ఈ ఏడాది అర్ధాకలితో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం సాయంత్రం సమయంలో స్నాక్స్ అందించేందుకు నిధులు మంజూరయ్యాయని మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు.

బాసర అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- మంత్రి సీతక్క
- బాసర అమ్మవారికి పూజలు


పూజలు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క

భైంసా: బాసర అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క అన్నారు. నిర్మల్ జిల్లా బాసరకు గురువారం వచ్చిన ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు స్థానిక ఎమ్మెల్యే రామారావుపటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి స్వాగతం పలికారు. బాసర ఆలయంలో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. బాసర ఆలయ అర్చకులు మంత్రి సీతక్కను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బాసర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. రానున్న వసంత పంచమి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపుతుందని పేర్కొన్నారు. వచ్చే ఏడాది వసంత పంచమినాటికి శాశ్వత క్యూలైన్‌లతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ వసంత పంచమి వేడుకలకు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి వస్తానని చెప్పారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు ఇది వరకే పరిశీలించామన్నారు. జిల్లా ప్రజా ప్రతినిధులతో కలిసి దేవాదాయశాఖ మంత్రితో చర్చించామని తెలిపారు. వసంత పంచమి ఉత్సవాలకు సంబంధించిన ప్రచారానికి మీడియా ప్రత్యేక చొరవచూపిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

గంజాయి పట్టివేత

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్ చౌరస్తాలో గురువారం మధ్యాహ్నం గంజాయి పట్టుకున్నట్లు ఆర్మూర్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్సన్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం లింగట్ల గ్రామానికి చెందిన రంజిత్‌సింగ్, బరదవత్ గవాస్కర్ బైక్‌పై గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారి నుంచి 1.3 కిలోల గంజాయి, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

3న బహిరంగసభ

చెన్నూర్‌రూరల్: ఫిబ్రవరి 7న లక్ష డప్పులు, వేల గొంతుకల మహా సాంస్కృతిక ప్రదర్శన విజయవంతం చేయడంలో భాగంగా 3న చెన్నూర్‌లో వెయ్యి డప్పులు, వంద గొంతుకలతో బహిరంగసభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీశ్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభకు మంద కృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు కలగూర రాజ్‌కుమార్, బహుజన సోషలిస్టు పార్టీ మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సినీఫక్కీలో రూ.5లక్షలు చోరీ

నిర్మల్‌టౌన్: సినీఫక్కీలో రూ.5లక్షలు చోరీ చేసిన ఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన సిరిగే నరేష్ ఓ ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. తన అల్లుడైన కళ్యాణ్‌కు డబ్బులు అవసరం ఉండడంతో జిల్లా కేంద్రంలోని మయూరి హోటల్ వద్ద గల యూనియన్ బ్యాంకుకు వచ్చారు. ఖాతాలోంచి రూ.5 లక్షలు డ్రా చేశారు. నరేష్ అల్లుడు కళ్యాణ్ కవర్‌తో సహా నగదును ద్విచక్ర వాహనం సైడ్‌బాక్సులో పెట్టాడు. ఫోన్ మాట్లాడుకుంటూ సమీపంలోని మయూరి హోటల్‌కు వెళ్లాడు. కళ్యాణ్‌కు కూడా అదే సమయంలో ఫోన్ రావడంతో మాట్లాడుకుంటూ ముందుకెళ్లాడు. ఇద్దరూ బైక్ వద్దకు వచ్చి స్టార్ట్ చేసే ముందు సైడ్ బాక్సులో చూసుకోగా కవర్ కనిపించలేదు. వెంటనే చుట్టుపక్కల వెతికినా ఎవరూ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి సైడ్‌బాక్సులో గల కవర్ తీసుకెళ్లినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆ కవర్‌లో తన చెక్‌బుక్ కూడా ఉందని బాధితుడు తెలిపాడు.

'విలీన సభను విజయవంతం చేయాలి'

పాతమంచిర్యాల: ఫిబ్రవరి 5న సూర్యాపేటలో నిర్వహించనున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీల విలీన సభను విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మంతెన మల్లన్న, జిల్లా కార్యదర్శి ముస్కు జ్యోతి కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి, భుక్తి, దేశ విముక్తికోసం దోపిడీ వ్యవస్థపై వీరోచితంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటం నుంచి సమాఖ్య ఆవిర్భవించిందని, ప్రజలను చైతన్యవంతులను చేసే క్రమంలో ఎంతోమంది అమరులయ్యారని, వారి త్యాగాలను స్మరించుకుంటూ ఫిబ్రవరి 5న నిర్వహించే తెలంగాణ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రెండు రాష్ట్ర కమిటీల విలీన సభకు కవులు, కళాకారులు, రచయితలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా నాయకులు దారిశెట్టి అరుణ, కిష్టన్న, రాజశేఖర్, రాజన్న పాల్గొన్నారు.